# అయామ్ సారీ...!

--గోపరాజు రాధాకృష్ణ

కాళ్ళకి అడ్డుపడుతున్న లుంగీని కొంచెం పైకెత్తి అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాను. చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి. మనసంతా చాలా చికాగ్గా వుంది. కొద్ది నిమిషాల క్రితం ఇంట్లో రిత్వికతో జరిగిన కాన్వర్సేషన్‌తో చికాకుకాక మరేమిటి?

ఒక్కోసారి నా ప్రవర్తన మీద నాకే అసహ్యం వేస్తుంది. రిత్విక సెన్సిటివ్ అని తెల్సుండీ నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోవడం, షార్ట్ టెంపర్‌మెంట్ - ఇవి నా వీక్‌నెస్‌లేమో అనిపిస్తుంది. జరగాల్సింది కాస్తా జరిగిన తర్వాత అనిపిస్తుంది - ఎందుకలా చేశాను? ఎందుకంత ఫూల్‌లా ప్రవర్తించాను? అని.

అయినా ఇప్పుడు జరిగిన దాంట్లో నా కోణం నుంచే నేను ఆలోచిస్తున్నాను. నేనేదో చిన్న మాటంటే తను అంతగా ఫీలైపోవాలా? రెండు గుండెల దూరంలో మధ్య ఇగోకి స్థానం వుండాలా? బహుశా ఆమె కూడా అలాగే అనుకుంటూ వుంటుందేమో.

- ఆలోచనలు ఇహ ముందుకెళ్ళలా. డిస్టర్బ్ అయ్యాయి. అడుగులకు అసంకల్పితంగా బ్రేకులు పడ్డాయి. ఆలోచనల నుంచి బయటపడి చూశాను. బ్రహ్మం పిలిచాడు. వెంటనే ముఖానికి నవ్వు మాస్క్ తొడుక్కొని అతన్ని పలకరించాను.

"ఏంటి బాబూ. పెళ్ళయ్యాకా ఇటు అసలు రావడమే మానేశారు?" అన్నాడతను నాకు పీట వేస్తూ. వాచీ చూసుకున్నాను. ఆరున్నర. "కాఫీ వుందా?" అని అడిగాను. ఉందన్నాడు. ఇమ్మన్నాను. పెళ్ళికాక ముందు కాఫీ, టిఫిన్లకు బ్రహ్మం ఖాకా హోటల్‌కే వచ్చేవాణ్ణి. చిటికలో కాఫీ ఇచ్చాడు. నిజానికి ఇది నేను కాఫీ తాగే టైము కాదు. మొదటి గుక్కసిప్ చేశాను.పావు గంట క్రితం ఇంట్లో జరిగిన సంఘటన మెదడులో మెదిలింది.

...ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్ళాను. లూనా పార్క్ చేసి కాలింగ్ బెల్ నొక్కాను. లోపల్నుంచి రెస్పాన్స్ లేదు. తలుపు కొట్టాను. అయినా ప్రయోజనం లేకపోయింది.

రిత్విక లోపల ఏం చేస్తున్నట్టు?
ఏదేనా ముఖ్యమైన పనిలో వుందా?
నా కోసం జీడిపప్పు ఉప్మా చేస్తోందా?
నిద్రపోతోందా?

ఈసారి బలంగా తలుపు చరిచాను. "ఆ! వస్తున్నా... ఒక్క నిమిషం" అని వినిపించింది నా స్వీటీ వాయిస్. "లింగు లిటికుల కథ ఇది బేటా ముసుగులో గుద్దులాట" పాటను హమ్ చేస్తూ అటూ ఇటూ తిరిగాను. తలుపు తెరువబడలేదు. మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కాను. కిటికీ దగ్గరకి వెళ్ళి పిలిచాను. ఊహూ తలుపు తియ్యాలా. పెరట్లోకి వెళ్ళి వెనక నుంచి గదిలోకి వచ్చాను. వంట గదిలో ఒబ్బిడిగా చాప మీద కూర్చుని జాకెట్‌కి అద్దాలు కుడుతోంది రిత్విక. నన్ను చూసి ఓ నవ్వు విసిరింది. ఆ నవ్వంటే నాకు చాలా ఇష్టం. డైరెక్టుగా గుండెల్లో గుచ్చుకుంటుంది. నేనూ నవ్వాల్సింది. కానీ కోపాన్ని ప్రదర్శించదలచి ఆమెకేసి తీక్షణంగా చూసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాను. చాపమీద రెండుమూడు చీరెలు, పేర్లు తెలియవుగానీ - ఏవో ఎంబ్రాయిడరీ సామాన్లు, అద్దాలూ వున్నాయి. బట్టలు మార్చుకొని సింకు దగ్గరకు వెడుతూ మళ్ళీ సీరియస్‌గా చూశాను రిత్వికని. మళ్ళీ నవ్వింది. నవ్వుతో చిత్తగ్గొట్టగల్గడం



ఆమెకే చెల్లింది. నా సీరియస్‌నెస్‌ని సీరియస్‌గా తీసుకున్నట్టు లేదు. నేను సరిగా నటించలేక పోతున్నానా? ముఖం కడుక్కుని బెడ్‌రూమ్‌లో ఫాన్‌వేస్కుని, కుర్చీలో వాలాను. అసలీపాటికి రిత్విక రోజూ కాఫీ, టిఫిన్ అందించేది. గదిలోంచి బయటికొచ్చి గుమ్మానికి జారబడి బొటన వేలు నోటివైపుచూపించాను.

"ఇఫ్ యు డోంట్ మైండ్ ... టేబుల్ మీద ఫ్లాస్కులో కాఫీ వుంది. టిఫినేమీ చెయ్యలేదు... సారీ" మళ్ళీ చిద్విలాసం చిందించింది. నాకు కోపం మొదలయింది. కో ఆపరేట్ చేద్దామని కాఫీ తాగాను – గ్లాసులో పోసుకుని. ప్రాణం లేచి వచ్చినట్టయింది. పెద్దన్నయ్య నుంచి వచ్చిన ఉత్తరం చూశాను. వెంటనే సమాధానం రాశాను.కాసేపు టేపు రికార్డరు పెట్టుకున్నాను. మరి కాస్సేపు టీ.వీ. చూశాను. కొంతసేపు రేడియో విన్నాను. వీధిలో కుర్చీ వేస్కుని చల్లగాలి పీల్చాను. డాబా ఎక్కి పచార్లు చేశాను. రిత్విక తనపని తాను చేస్కుంటోందే తప్ప నన్నుపట్టించుకోవడం లేదు. నాలో కోపం పాలు కొద్దిగా పెరగసాగింది.

పోనీ పని చేస్కుంటూనే నన్ను ఎంగేజ్ చెయ్యొచ్చుగా?

కాన్సెంట్రేషన్ దెబ్బ తింటుందా?

దాదాపు రెండు గంటలు అలానే గడిచాయి. అంతసేపూ ఏకాంతంతో సావాసం చేశాను. కోపాన్ని కంట్రోల్ చేసుకుందామంటే నా వల్ల అయ్యేట్టు లేదు.

రిత్విక దగ్గరగా వెళ్ళి–

"అన్నం పెడతావా? ఇఫ్ యు డోంట్ మైండ్ మీరే వండుకొని పెట్టుకోండి అంటావా?" అవడిగాను – గొంతుకు కోపం కలిపి, ఇందాకా నవ్విన దాంట్లో సగం నవ్వింది రిత్విక. ఏ కోశానా రెస్పాండ్ కాదల్చుకోలేదు కాను.

"ఆ శ్రమ మీకివ్వను. వచ్చేస్తున్నా ... ఆఖరి పువ్వు" అంది – పని చేసుకుంటూనే.

ఏం నెగ్లిజెన్స్?

"సుమారు ఎంత సేపువెయిట్ చెయ్యాలో చెబితే రోడ్లు కొలిచి వస్తాం" అన్నాను.

"మీరుమరీను ... అయిపోయిందంటున్నాను కదా"

–నేనంటే ఎందుకంత నిర్లక్ష్యభావం?

ఉదయం పది గంటల్నుంచీ ఖాళీయేగా–

అప్పుడు ఇలాంటివి చేస్కోవచ్చుగా–

అప్పట్నుంచీ ఏ గుడ్డి గుర్రానికి పళ్ళుతోముతోందో?

రిత్విక చిన్నగా మూలిగింది.. బాధతో వెంటనే చూపుడు వేలునోట్లో పెట్టుకుంది.

అరె... సూది గుచ్చుకుంది.

సూది నా గుండెల్లో గుచ్చుకున్నట్టే అనిపించింది.

"ఎందుకు... ఆపెయొచ్చుగా" అందామనుకున్నా. అలాంటి సలహాలేవీ ఆమెకివ్వదల్చుకోలేదు – ఇచ్చినా వేస్టనిపించి.

టేబుల్ దగ్గరకి వెళ్ళి గిన్నెల్లో చూశాను.


ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడు చెప్పాను – బంగాళా దుంపల వేపుడు చేయమని. ఏ గిన్నెలోనూ అది కనిపించలేదు. బూరెల మూకుడు మేకుకి వేలాడుతూ కనిపించింది.

"కూర ఇంకా చెయ్యలేదు"అంది రిత్విక.

నా ఇగో దెబ్బతింది. సహనం అంచులు దాటింది .

విసవిసా గదిలోకెళ్ళాను. నిరసన తీవ్రతని రిత్విక గమనించకపోలేదు. ఓ రెండు నిమిషాలు కోపంగా గడిపాను.

రెండు చీరెలు, ఒక జాకెట్టు పట్టుకుని గదిలో కొచ్చింది రిత్విక. పిలిచింది. తల తిప్పకూడదనుకుంటూనే తిప్పాను.




"జాకెట్‌కి అద్దాలు కుట్టాను, ఈ చీరకి ఫాల్ కుట్టాను. ఈ చీరకి ఎంబ్రాయిడరీ చేశాను. చూడండి ఎంత బాగా వచ్చాయో. అలా వస్తాయనుకోలేదు. మీ తమ్ముడి ఒడుగుకి మామయ్యగారిచ్చిన చీరయితే ఇంకా అందంగా వుంది కదండీ–' అన్నీ నా చేతికిచ్చింది. బహుశా నా నుంచి. అభినందన పూర్వక ప్రశంస ఆశించుంటుంది రిత్విక.

నా కోపాన్ని తీర్చుకునే టైమొచ్చింది.

"ఏడిసినట్టుంది" అన్నాను అన్నీ మంచం మీమ్మద పడేసి. రిత్విక ముఖంలో నేను ఎక్స్‌పెక్ట్ చేసిన మార్పే కనిపించింది. ఓ లిప్తపాటు నాలో శాడిస్టిక్ ఆనందం!

"ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ ... టైం చాలా విలువైనది, ఆడాళ్ళకైనా మగాళ్ళకైనా. వీటి కోసం నువ్వు చాలా టైం వేస్ట్ చేసి వుంటావు. పనికొచ్చే పనులేవేనా చేస్కుంటే మంచిదని నా సలహా. ఇంట్లో కూర్చుని నువ్వు చేస్తున్నపనులు ఇవేనా? ఇదేదో గొప్పపని అయినట్టు, బ్రహ్మవిద్య అయినట్టూ చెబుతున్నావే. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ పర్వతారోహణ చేసినప్పుడు ఫ్లెమింగ్స్ పెన్సిలిన్ కనిపెట్టినప్పుడు చేసిన లెవెల్లో హడావుడి చేశావు. అదేదో ప్రపంచ వింత అయినట్టు. గిన్నీస్ బుక్‌కి ఎక్కాల్సిన అంశం అయినట్టూ పెద్దగొప్ప! చీరలు, జాకెట్టు, కొంత డబ్బూ వేస్టయ్యాయంతే" అని ఉపన్యాసం దంచాను. ఈ మాత్రం "అవుట్‌లెట్"నాకు ఆనందం కలిగించింది. "మొగుడికి కాఫీ ఇవ్వడం కన్న, ఇష్టమైన వేపుడు చెయ్యడం కన్నా ఇవే ఎక్కువయ్యాయా నీకు?" అని లేచాను. "ఇంట్లో ప్రశాంతత లేకుండా చేస్తున్నావు. బంగాళా దుంపల వేపుడున్న చోటే భోంచేసి వస్తాను" అని షర్టు, చెప్పులు వేస్కుని బయటకొచ్చాను. వస్తూ వస్తూ ఓరకంట రిత్వికని చూశాను. ఆమెకళ్ళల్లో కన్నీటి పొరని నేను గమనించకపోలేదు ......

–కాంప్రమైజ్ అయిపోయుంటే బావుండేది.

కోపాన్ని అంత 'సినిమాటిక్'గా పెంచుకోవలసిన అవసరం లేదక్కడ నిజానికి.

– గ్లాసు బ్రహ్మనికి అందించాను.

వాట్ నెక్స్ట్?

ఏమీ జరగనట్టు ఇంటికెళ్ళిపోవాలా?

రిత్వికని ఓదార్చాలి.

అదొకటే ప్రాయశ్చిత్తం – అయిందేదో అయింది.

అహం అడ్డు పడ్తోంది.

పక్కన పుస్తకాల షాపువాడు కట్టేస్తూ బ్రహ్మంతో ఏదో బాతాఖానీ కొడుతున్నాడు. లోపల తాడుకి వేలాడుతున్న మేగజైను తీసుకున్నాను.ఇద్దరికీ డబ్బులిచ్చాను.

కాజువల్‌గా కాగితాలు తిప్పుతున్నాను.

ఓ పేజీ మీద నా దృష్టి నిలిచి పోయింది.

నా భృకుటి ముడివడింది. తక్షణం విషయం రిత్వికకి తెలియ చెయ్యాలి. రిత్విక బాధని, నా కోపాన్నీ కడతేర్చగల ఏకైక సాధనం అది. సమస్యని క్రియేట్ చేసింది నేనే గనక కిల్ చేసే ఆలోచన కూడా నేనే చెయ్యాలి. ఈ చక్కని అవకాశాన్ని వదలదల్చుకోలేదు.

వెంటనే లేచాను. గతం నాకు గుర్తులేదు. ఇంటివేపు వడివడిగా అడుగులు వేశాను. తలుపులు గెంటుకొని సరాసరి బెడ్‌రూమ్‌లో కెళ్ళాను. రిత్విక మంచం మీద బోర్లా పడుకుని వుంది. నా అలికిడి విని లేచి కళ్ళు తుడుచుకుంది. నా వంక చూసింది. ఆమె కళ్ళల్లో మళ్ళీ కన్నీటి తెర దిగింది.

– నేనెంత ఫూల్‌ని!

'సారీ' అందామనుకున్నాను. నోటి చివరి వరకూ వచ్చింది. 'ఇగో' గొంతుకు అడ్డు పడింది. 'ఈ మాత్రం దానికి ఇంతటి రాద్ధాంతం చెయ్యాలా?' అని అడుగుదామనుకున్నాను. అదే ప్రశ్న నన్ను వేస్తుందేమోననే కాంప్లెక్స్ నన్ను మూగగా వుంచింది.

వీక్లీ తెరిచాను.రిత్వికకి చూపించాను.

రిత్విక ఎక్స్‌ప్రెషన్స్‌లో మార్పు ఎక్స్‌పెక్ట్ చేశాను.

నేననుకున్నది జరగలేదు.

మనసు ఉసూరుమంది. నేను మాటలంటూంటే రిత్విక మనసు అదే మాదిరి ఫీలై వుంటుంది బహుశా.

ఆ రాత్రి –

పన్నెండింటికి మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి పక్కకి చూశాను. రిత్విక గాఢమైన నిద్రలో వుంది. సీలింగ్ ఫాన్ గాలికి ఆమెముంగురులు నుదుటి రంగస్థలం మీద చేస్తున్న నాట్యం బెడ్ లైట్ కాంతిలో గమ్మత్తుగా వుంది.


సిగరెట్ వెలిగించాను.

వీక్లీ తెచ్చిన తర్వాత సంఘటన గుర్తొచ్చింది.

ఆ వీక్లీలో రిత్విక పేరుతో నేను రాసిన కథ పబ్లిష్ అయింది. అదే తెచ్చి ఆమెకు చూపించి కోపం చల్లార్చాలని భ్రమించాను.

కథ చూపిస్తే రిత్విక అంది–

"ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ – టైం చాలా విలువైంది. దీన్ని వ్రాయడం కోసం మీరు చాలా టైం వేస్ట్ చేసి వుంటారు. పనికొచ్చే పనులేవేనా చేసుకోమని నా సలహా. మీరు ఆఫీసులో కూర్చుని చేస్తున్న పని ఇదేనా? ఇది బ్రహ్మ విద్య అయినట్టు చెబుతున్నారే. గిన్నీస్ బుక్‌లోకి ఎక్కవలసిన విషయం అంతకన్నా కాదు. రాసి మీరుకాగితాలు, ఇంకు, వాళ్ళ స్పేసూ వేస్ట్ చేశారు. నా పేరుకున్నవిలువంతా పాడు చేశారు" అంది. ఇంకా ఏవేవో అంది. అని నవ్వేసింది. అవి మనసులోంచి వచ్చిన మాటలు కావని ఆ నవ్వే చెబ్తోంది.




అప్పుడు –

మనస్ఫూర్తిగా ఆమెతో అన్నాను.

– "రిత్వికా! అయాం సారీ" అని.

... రిత్విక కిందికి తన్నేస్తున్న దుప్పటిని మెడ వరకూ కప్పి నేనూ నిద్రకి ఉపక్రమించాను.

ఆమెమాటలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. "ప్రతివారికీ అభిరుచి వుంటుంది. ఎవరి అభిరుచి వారిది. ఎదుటివారి అభిరుచిని కించపరచటం మంచిపని కాదు"

– ఎప్పుడు నిద్రపట్టిందో నాకే తెలీదు.

●